నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | శుక్రవారం 24 మే 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

గుల్లకోటను సందర్శించిన కేంద్ర బృందం

గుల్లకోటలో కేంద్ర బృందం సభ్యులు

లక్షెట్టిపేట, మే 23 : మండలంలోని గుల్లకోట గ్రామాన్ని కేంద్ర బృందం గురువారం పరిశీలించింది. ఈ సందర్భంగా అధికారులు గ్రామస్తులతో మాట్లాడారు. అధికారులు సకాలంలో గ్రామానికి వచ్చి సమస్యలపై స్పందిస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అంతేగాకుండా గ్రామంలో పారిశుధ్య పనులు, ప్రకృతివనం, శ్మశానవాటిక, క్రిమిటోరియం తదితర ప్రాంతాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. వారి వెంట ఎంపీడీవో సరోజ, ఎంపీవో ప్రసాద్, పంచాయతీ సెక్రటరీ తదితరులు ఉన్నారు.

సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తనిఖీ చేసిన డీఐజీ

ఫైళ్లు తనిఖీ చేస్తున్న కరీంనగర్ రేంజ్ డీఐజీ రవీందర్

హాజీపూర్, మే 23 : జిల్లా కేంద్రంలోని సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాన్ని రిజిస్ట్రేషన్-స్టాంపుల కరీంనగర్ రేంజ్ డీఐజీ రవీందర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. కార్యాలయంలోని రికార్డులు, రిజిష్టర్లను పరిశీలించారు. భూముల క్రయ, విక్రయాలకు చెందిన రిజిస్ట్రేషన్ పత్రాలను పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం భూముల రిజిస్ట్రేషన్, మార్కెట్ విలువ పెంచబోతుందనే ప్రచారం జరుగుతుందని, పెరిగితే ఇప్పుడున్న విలువ పై ఎంత శాతం పెరుగుతుందని 'నమస్తే తెలంగాణ' ప్రశ్నించగా, ప్రస్తుతం ప్రభుత్వం నుంచి భూముల రిజిస్ట్రేషన్, మార్కెట్ విలువ పెంపుపై ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు.

ఓటేయకుండా.. ఓటింగ్ పెంచారా..!?

ప్రెస్‌మీట్ పెట్టి మరీ ఎమ్మెల్యే స్థాయిని తగ్గించిన కాంగ్రెస్ నాయకులు

- 'నమస్తే కథనం'తో ఆగమాగం
- ప్రచురితమైన వారానికి ఖండనే మిటో మరి..
- ఉన్నమాటంటే ఉలికిపాటెందుకంటున్న ప్రజలు

లోకల్‌లో ఉండడు..
హైదరాబాద్‌లోనూ దొరకడు..
'నమస్తే'లో ప్రచురితమైన కథనం

బెల్లంపల్లి, మే 23 : ఈ నెల 15న 'నమస్తే తెలంగాణ' దినపత్రికలో బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ ''లోకల్‌లో ఉండరు.. హైదరాబాద్‌లోనూ దొరకరు''అనే శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ మొత్తం కథనంలో ఎమ్మెల్యే చెడ్డ వారని, మంచివారనే అర్థం వచ్చేలా ఎక్కడా రాయలేదు. ఎమ్మెల్యే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోలేదని, రాజ్యాంగం ప్రజలకు ఇచ్చిన ఓటు ద్వారా ఎన్నికైనా ఎమ్మెల్యే ఓటేయకపోవడం ఏమిటని.. రాజ్యాంగానికి, ప్రజాస్వామ్యానికి ఆయన ఇచ్చే గౌరవం ఇదేనా అని జనం చర్చించుకుంటున్న విషయాలనే ఆ కథనంలో ప్రచురించాం. ఇక ఆయన స్థానికంగా అందుబాటులో ఉండరంటూ రాసిన ప్రతి వ్యాఖ్యం బెల్లంపల్లి ప్రజానీకం మనసులో నుంచి బయటికి వచ్చినవే తప్ప.. ఎక్కడా కూడా ఎమ్మెల్యే గౌరవాన్ని భంగపరిచే ప్రయత్నం చేయలేదు. దీనిపై కొందరు బెల్లంపల్లి కాంగ్రెస్ నాయకులు ప్రెస్‌మీట్ పెట్టి మరీ ఎమ్మెల్యేపై దురుసుగా మాట్లాడినా, అసభ్యకరంగా రాసినా ఊరుకోమంటూ చెప్పారు. అసలు ఆ మొత్తం వార్తలో అసభ్యకరమైన పదజాలం ఎక్కడైనా ఉందా అంటే అదీ లేదు. ఎన్నికల సమయంలో ఎమ్మెల్యే ప్రజలకు చెప్పిన మాటలకు.. ప్రస్తుతం చేస్తున్న దానికి పొంతన లేదనేది జగమెరిగిన సత్యం. అది దాస్తే దాగేది కాదు. జనంలో ఈ అభిప్రాయాన్ని మాత్రమే నమస్తే ప్రచురించింది. ఆ వార్తను పూర్తిగా చదివారో.. లేదో కానీ కాంగ్రెస్ నాయకులు మాత్రం వార్త వచ్చిన వారానికి ప్రెస్‌మీట్ పెట్టి మరీ ఖండించడం శోచనీయంగా మారింది. వార్త వచ్చిన వారం రోజులకు ఖండన ఏమిటనేది అర్థం కాలేదు. పైగా ఎమ్మెల్యే ఓటు వేయలేదు కానీ.. ఆయనే 15 శాతం ఓటింగ్ పెంచారంటూ సదరు నాయకులు మాట్లాడి.. ఎమ్మెల్యే స్థాయిని వాళ్లే తగ్గించారు. మా ఎమ్మెల్యే ఓటు వేయలేదంటూ ఆ పార్టీ నాయకులే చెప్పడం ఇప్పుడు పెద్ద చర్చనీయాంశంగా మారింది. ప్రజా సమస్యలకు, ప్రజా అభిప్రాయాలకు అద్దం పడుతున్న కథనాలు ప్రచురిస్తున్న పత్రికపై అక్కసు ఎందుకని, జనంలో ఉన్నదే ఆ పత్రికోళ్లు రాశారని బెల్లంపల్లి ప్రజలే చెబుతున్నారు. 2018లో ఏనుగు గుర్తుపై పోటీ చేసినప్పుడు ఇప్పుడున్న ఎమ్మెల్యే ఎక్కడ ఓటేశారు.. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో ఎక్కడ ఓటు వేశారు.. ఎంపీ ఎన్నికల్లో ఎక్కడ ఓటు వేశారు.. దీనికి సంబంధించి ఆధారాలుంటే చూపించాలంటూ బెల్లంపల్లి జనం గుసగుసలాడుకుంటున్నారు. ఓటేయకుండా రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిన ఓ ఎమ్మెల్యే తీరుపై పత్రికల్లో వార్తలు వస్తే ఎందుకు అంతలా రియాక్ట్ అవుతున్నారో చెప్పాలంటున్నారు. ఉన్నమాటంటే ఉలికిపాటెందుకని, ఇప్పటికైనా ప్రజాభీష్టం మేరకు నాయకులు నడుచుకోవాలని జనం కోరుతున్నారు.

దుగ్నేపల్లిలో ధాన్యం దోపిడీ

బస్తాకు మూడు కిలోల చొప్పున స్వాహా చేస్తున్న కేంద్రం నిర్వాహకులు

- ఎమ్మెల్యే చెప్పిన వ్యక్తికే ఇక్కడ కొనుగోలు సెంటర్ కేటాయింపు
- ఈ మోసానికి బాధ్యత ఎమ్మెల్యేదా.. అధికారులదా..?
- ఈ విషయమై ముందే హెచ్చరించిన 'నమస్తే తెలంగాణ'
- అధికారుల నిర్లక్ష్యంతో నష్టపోతున్న రైతన్నలు
- రా మిల్లులకు ధాన్యం ఇవ్వమని.. ఇప్పుడెలా కేటాయించినట్లో..!


ఎమ్మెల్యేలు చెప్పినోళ్లకే
డీసీఎంఎస్ కేంద్రాలు
ఏప్రిల్ 23న నమస్తే తెలంగాణ ప్రచురించిన కథనం..


DCMS CENTERS
Dr. G. VIVEK VENKATASWAMY
MLA CHENNUR CONSTITUENCY
చెన్నూర్‌లో దుగ్నేపల్లి సెంటర్‌ను విజేందర్‌రెడ్డికి ఇవ్వాలంటూ ఎమ్మెల్యే వివేక్ రాసిన లేఖ

మంచిర్యాల, మే 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లాలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణ లోపాలు.. రైతన్నల పాలిట శాపాలుగా మారాయి. పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నా పట్టించుకోకుండా ఎమ్మెల్యేలు సిఫార్సు చేసినోళ్లకే సెంటర్లు కేటాయించారు. కోడ్ అమల్లో ఉండగా ఇలా ఎందుకు చేశారంటే.. 'అది మాకు సంబంధం లేదు. డీసీఎంఎస్, పీఏసీఎస్ ఏజెన్సీలు సూచించిన వారికే సెంటర్లు ఇచ్చాం' అని చెప్పుకొచ్చారు. కాగా, ఇదే విషయమై ఏప్రిల్ 23న 'నమస్తే తెలంగాణ'లో 'ఎమ్మెల్యే చెప్పినోళ్లకే డీసీఎంఎస్ కేంద్రాలు' శీర్షికన కథనం ప్రచురితమైంది. కోనుగోలు కేంద్రాల్లో అవకతవకలు జరిగితే బాధ్యతెవ్వరిది.. అంటూ కథనాన్ని ప్రచురించింది. దుగ్నేపల్లి సెంటర్‌ను విజేందర్‌రెడ్డికి ఇవ్వాలంటూ ఎమ్మెల్యే సిఫార్సు చేసిన లెటర్‌ను, అధికారులు అదే పేరుతో ఇచ్చిన లిస్టును సైతం ఆ కథనంలో ప్రచురించింది. అప్పటి వరకు ఎమ్మెల్యేల జోక్యం లేదంటూ చెప్పుకొచ్చిన అధికారులు.. ఇలా ఎమ్మెల్యే లెటర్, ధాన్యం కొనుగోలు కేంద్రాల లెటర్లు బయటికి రావడంతో కిందిస్థాయి కార్యాలయ సిబ్బందిపై సీరియస్ అయినట్లు తెలిసింది. కాగా, ఇప్పుడు ఏ వ్యక్తికైతే చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వినోద్ దుగ్నేపల్లి సెంటర్ ఇవ్వాలంటూ సిఫార్సు చేశారో.. ఆ సెంటర్ నిర్వాహకుడు తూకాన్ని మార్చి రైతులను ముంచుతున్నాడు. బుధవారం ధాన్యం విక్రయించేందుకు సింగరేణి సంపత్ అనే యువకుడు ఈ సెంటర్‌కు వచ్చాడు. నిర్వాహకులు 41 కిలోల 400 గ్రాముల చొప్పున తూకం వేశారు. అనుమానం వచ్చిన సంపత్ పక్కనున్న ఐకేపీ సెంటర్ నుంచి తూకం తీసుకువచ్చి అదే సంచులను జోకగా, అవి ఒక్కొక్కటీ 42 కిలోల 400 గ్రాములు ఉన్నాయ్. ఇలా ఒక కిలో మైనస్ చేసి డీసీఎంఎస్ సెంటర్ వాళ్లు చేస్తున్న మోసాన్ని యువకుడు బయటపెట్టడంతో అక్కడున్న రైతులంతా అయోమయం లోపడిపోయారు. 40 కిలోలు జోకాల్సిన బస్తాకు 42 కిలోల 400 గ్రాములు ఎందుకు ఎక్కువ జోకుతున్నారంటూ ప్రశ్నించారు. తూకంలో తేడాలు, మిల్లర్ల కోతలు కలిపి ఒక్కో సంచిపై మూడు కిలోలకు పైగా వరకు కోత పెడుతున్నారని.. ఈ మూడు కిలోల నష్టాన్ని ఎవరు భరించాలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తూకంలోనే కాకుండా రైస్ మిల్లుకు పోయాక అక్కడ మిల్లరు బస్తాలు తగ్గించి ట్రక్ షిట్‌లో రాస్తున్నారని వాపోతున్నారు. మరి ఇప్పటికైనా అధికారులు స్పందించి తూకంలో తేడాలు చేసిన సదరు నిర్వాహకుడిపై చర్యలు తీసుకుంటారా లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

రా మిల్లులకు ఎందుకు ఇచ్చినట్లు..

కోసమెరుపు ఏమిటంటే.. సీజన్ ప్రారంభానికి ముందు నుంచి అధికారులు రా రైస్ మిల్లులకు ఈ సారి యాసంగి ధాన్యం ఇవ్వడం లేదని చెప్పుకుంటూ వచ్చారు. పలు ఛానళ్లు, పేపర్లకు ఇచ్చిన ఇంటర్వ్యూలలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. మీడియా ప్రతినిధులు వెళ్లిన ప్రతిసారి యాసంగి ధాన్యం రా రైస్ మిల్లులకు ఇస్తే అది నూక ఎక్కువ వస్తది. అందుకే ఈ సారి మొత్తం ధాన్యాన్ని జిల్లాలోని పారా బాయిల్డ్ రైస్ మిల్లులకు కేటాయిస్తున్నట్లు చెప్పుకొచ్చారు. ఈ మేరకు జిల్లాలోని 19 పారా బాయిల్డ్ రైస్ మిల్లులకు ట్యాగింగ్ ఇచ్చారు. మొత్తం సేకరించే లక్షా 70 వేల మెట్రిక్ టన్నుల ధాన్యంలో ఈ 19 మిల్లులకు దాదాపు 90 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం పోవాలి. కానీ ఆ లక్ష్యం పూర్తి కాకుండానే పెద్దపల్లిలో 45 మిల్లులకు ట్యాగింగ్ ఇచ్చారు. సరే ధాన్యం సెంటర్లలో ఉండకూడదు త్వరగా మిల్లులకు వెళ్లాలనే ఉద్దేశంతో ఈ ట్యాగింగ్ ఇచ్చారనుకుంటే.. తాజాగా మంచిర్యాల జిల్లాలోని 13 రా రైస్ మిల్లులకు సైతం ట్యాగింగ్ ఇచ్చారు. మరి ముందేమో రా రైస్ మిల్లులకు ట్యాగింగ్ ఇవ్వమని చెప్పిన అధికారులు.. ఇప్పుడు ఎలా ఇచ్చారు అనేది అర్థం కావడం లేదు. ఏదేమైనా అధికారులు ఇప్పటికైనా రైతులను ఇబ్బందులు పెట్టకుండా తూకం తేడాలను తగ్గించి, మిల్లర్ల కట్టింగ్‌ను నివారించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు. మరి ఇప్పటికైనా ఇన్ని రోజులు రైతులను మోసం చేసి దుగ్నేపల్లి సెంటర్ నిర్వాహకులపై అధికారులు చర్యలు తీసుకుంటారా..లేదా అనేది వేచి చూడాల్సి ఉంది.

శివ్వారం సెంటర్‌పై ఎన్నికల సంఘం, హై కోర్టు మొట్టికాయలు


Name of the PPC	Agency	PPC center incharge	Contact number
Dasigapally	DCMS	B.Rajkumar	8374797177
Dasigapally	DCMS	Laxminarayana Reddy	8328008946
Jaipur Dasigapally	DCMS	CH.Rajshekar	9949046335
Kistapur	DCMS	Mukesh Hemesh	9966166588
Kondaram	DCMS	P.Thirupathi	8014131916
Mudigunta	DCMS	Akash	9309793039
Narsingapur Modikunta	DCMS	T.Sai	9908528477
Shivvaram	DCMS	Sammaiah	8978133933
Tekumatla	DCMS	Narsani Sambaiah	8978332433
Tekumatla	DCMS	CH.Sathish	9059341671
Jaipur	DCMS	Vallagiri Abhishek	9440903555
Jaipur	DCMS		
Jaipur	DCMS	Sandeep Reddy	9440903333
Jaipur	DCMS	Srisaine	9949652436
Jaipur	DCMS	G.Satheesh	9703035689
Jaipur	DCMS	B.S.Murthy	8303385369
Kanaipally	DCMS	Anne Ferdaus	8328410387
Kanaipally	DCMS	Akmal	9160297909
Kanaipally	DCMS		9010853603

డీసీఎంఎస్ ఏజెన్సీ 2023-24 సీజన్‌లో ధాన్యం సేకరణకు శివ్వారం సెంటర్‌ను సమ్మయ్యకు కేటాయిస్తూ పంపిన జాబితా.. సమ్మయ్య పేరు పక్కన లైన్ వేసి (ఫర్ మౌనిక బై విశ్వంబర్‌రెడ్డి) అని రాసిన ఉన్నతాధికారి

ధాన్యం కొనుగోళ్ల సెంటర్‌లు ఎమ్మెల్యేలు చెప్పినోళ్లకు కేటాయించలేదని, ఏజెన్సీలు చెప్పినోళ్లకే కేటాయించామని అధికారులు చెప్పినా.. అది ఎంత వరకు నిజమనేది తెలియడం లేదు. ఎందుకంటే జైపూర్ మండలం శివ్వారంలో గతంలో డీసీఎంఎస్ సెంటర్‌ను నిర్వహించిన సమ్మయ్య అనే వ్యక్తికి కాకుండా కొత్త వ్యక్తికి కేటాయించారు. దీనిపై సదరు వ్యక్తి ఎన్నికల కమిషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఎన్నికల సంఘం చెప్పినా జిల్లా అధికారులు సెంటర్‌ను మార్చలేదు. దీంతో ఆయన హై కోర్టును ఆశ్రయించారు. కోర్టు సైతం ఎన్నికల నియమావళి అమల్లో ఉండగా ఇలా ఎలా చేస్తారు.. ఎన్నికల సంఘం ఇచ్చిన డైరెక్షన్‌ను అనుసరించాలంటూ తేల్చి చెప్పింది. అప్పటికీ అధికారులు స్పందించకపోవడంతో కోర్టు ధిక్కరణకు అప్పీల్ చేసినట్లు తెలిసింది. విషయం పెద్దది కావడంతో హుటాహుటిన సమ్మయ్యను కలెక్టరేట్‌కు పిలిపించుకున్న అధికారులు సెంటర్ తిరిగి కేటాయిస్తునట్లు లెటర్ ఇచ్చారు. మరి ఎమ్మెల్యే చెప్పినోళ్లకు సెంటర్ ఇవ్వనప్పుడు.. ఏజెన్సీ చెప్పినోళ్లకే సెంటర్ ఇచ్చినప్పుడు.. అధికారులు తిరిగి సమ్మయ్యకు ఎందుకు సెంటర్ కేటాయించారని ఆరా తీయగా.. డీసీఎంఎస్ ఏజెన్సీ సెంటర్ల నిర్వాహకుల పేర్లను సూచిస్తూ పంపిన తొలి జాబితాలో సమ్మయ్య పేరే ఉన్నట్లు తెలిసింది. జిల్లా స్థాయి ఉన్నతాధికారి ఒకరు ఉద్దేశపూర్వకంగా సమ్మయ్య పేరును తీసేసి దాని పక్కన (ఫర్ మౌనిక బై విశ్వంబర్‌రెడ్డి) అని రాసి పంపించారట. ఇలా రాసి పంపిన పత్రం ఇప్పుడు తాజాగా నమస్తే తెలంగాణ చేతికి చిక్కింది. ఇలా ఇష్టం వచ్చినట్లు సదరు అధికారి లిస్టును ఫైనల్ చేయనందుకే అప్పుడున్న డీసీఎస్‌వో తుది జాబితాలో సంతకం చేయలేదని సివిల్ సప్లయ్ డిపార్ట్‌మెంట్‌లో పని చేసే అధికారులే చెబుతున్నారు.

దొంగ బంగారం కలకలం..

- సిద్దిపేటలో చోరీ.. మంచిర్యాలలో విక్రయం
- రెండు కేసుల్లో మిస్సైన గోల్డ్ కోసం మంచిర్యాలకు సిద్దిపేట పోలీసులు
- కొన్ని రోజులుగా జిల్లా కేంద్రంలో మూసి ఉంటున్న జువెల్లరీలు

మంచిర్యాల జిల్లా కేంద్రంలో కొన్ని రోజులుగా మూసి ఉన్న గోల్డ్ షాపులు

మంచిర్యాల, మే 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కేంద్రంలో దొంగ బంగారం క్రయవిక్రయాలు చేశారనే వార్తలు కలకలం రేపుతున్నాయి. సిద్దిపేట జిల్లాలో ఓ దొంగ చోరీ చేసిన సొత్తు మంచిర్యాల జిల్లా కేంద్రంలోని ఓ జువెల్లరీ షాపులో విక్రయించినట్లు పోలీసులు చెబుతున్నారు. ఈ మేరకు సిద్దిపేట టూ టౌన్ సీఐ ఉపేందర్ గత శనివారం మంచిర్యాలలోని ఓ జువెల్లరీ షాపుకు వెళ్లి విచారించినట్లు విశ్వసనీయ సమాచారం. వివరాల్లోకి వెళ్తే.. బంగారం చోరీ చేసిన రెండు కేసుల్లో నిందితుడిగా ఉన్న ఓ వ్యక్తి జిల్లా కేంద్రంలోని జువెల్లరీ షాపు యజమానికి రూ.4 లక్షలకు విక్రయించినట్లు ఒప్పుకోవడంతో పోలీసుల అతడిని ఇక్కడికి తీసుకొచ్చి విచారణ చేసినట్లు సమాచారం. మూడు నెలల 15 రోజుల క్రితం మీ షాపులో గోల్డ్ అమ్మినట్లు దొంగ చెబుతున్నాడని సదరు జువెల్లరీ షాపు యజమానిని అడుగగా, తాము షాప్ పెట్టే రెండు నెలలు అవుతుంది.. మూడు నెలల క్రితం ఎలా కొంటామని పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. ప్రస్తుతం విచారిస్తున్న షాప్ కొత్తదని, పాత షాపులో ఈ యజమానికే బంగారం విక్రయించానని దొంగ చెప్పినట్లు తెలిసింది. దీంతో సదరు షాపు యాజమానిని విచారణకు రావాల్సిందిగా పోలీసులు కోరగా, మరుసటి రోజు వస్తానని చెప్పారు. ఆ రోజు రాత్రే సదరు షాపు యాజమాని ఆసుపత్రిలో జాయిన్ అయినట్లు తెలిసింది. ఈ వ్యవహారం ఇప్పుడు జిల్లాలో చర్చనీయాంశమైంది. దొంగ బంగారం కేసు విచారణ కోసం జువెల్లరీ షాపుల యాజమానులందరూ ఏకమైనట్లు తెలుస్తుంది. అందుకే సిద్దిపేట పోలీసులు మంచిర్యాలకు వచ్చి వెళ్లిన నాటి నుంచి చాలా వరకు గోల్డ్ షాపులు మూసి ఉంటున్నాయి. దొంగ బంగారం విచారణ తమ షాపులపైకి వచ్చి పడుతుందోనన్న భయంతోనే నిర్వాహకులు షాపులు తీయడం లేదనే గుసగుసలు వినిపిస్తున్నాయి. కాగా, గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సుమారు 35 మంది షాపుల యజమానులు సిద్దిపేట పోలీసులను కలిసేందుకు వెళ్లినట్లు తెలిసింది.

డంప్ యార్డును తరలించాలి

జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

డంప్ యార్డును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారీ

కాగజ్‌నగర్, మే 23 : కాగజ్‌నగర్ మండలం బలగల డంప్ యార్డును గురువారం జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారీ పరిశీలించారు. డంప్ యార్డుకు సమీపంలోనే మూడేళ్ల క్రితం మైనార్టీ గురుకులాలు నూతనంగా నిర్మించారు. డంప్ యార్డులో చెత్తాచెదారం కాల్చినప్పుడు వచ్చే పొగతో సమీపంలోనే ఉన్నా మైనార్టీ గురుకులాల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఆయయన పరిశీలించారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా డంప్ యార్డును తరలించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ అంజయ్య, డీఈ రమాదేవి, మేనేజర్ క్రాంతి, సిబ్బంది ప్రనీల్, శంకర్, సుధాకర్, ప్రిన్సిపాల్ సుజాత్ ఉన్నారు.

పోస్టర్ విడుదల చేస్తున్న డీఎంహెచ్‌వో, ఏన్‌జీవో

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం

ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డా.అనిత

మంచిర్యాల ఏసీసీ, మే 23 : లింగనిర్ధారణ పరీక్షలు చేయడం నేరమని, అలాంటి చర్యలకు పాల్పడితే మూడేళ్లపాటు జైలు శిక్ష విధించబడుతుందని మంచిర్యాల జిల్లా ఇన్‌చార్జి వైద్య, ఆరోగ్యశాఖాధికారి డా.అనిత అన్నారు. గురువారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌వో ఆధ్వర్యంలో అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో 45 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని, లింగ నిర్ధారణ చేయరాదంటూ పోస్టర్లు అతికించాలని, వారి సర్టిఫికెట్లను ప్రదర్శించాలని, స్కానింగ్ కేంద్రాల్లో ఎలాంటి ఫొటోలు పెట్టరాదని ఆదేశించారు. అనంతరం 12 దవాఖానల రెన్యువల్ కోసం, రెండు స్కానింగ్ సెంటర్ల మంజూరు కోసం పై అధికారులకు పంపించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో నోడల్ ఆఫీసర్ డా.నీరజ, ఎన్‌జీవోలు డా.రాధిక, డా.కోటేశ్వరరావు, డా.సుధాకర్, డా.రాజ్ కిరణ్, డెమో బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు.

గ్రూప్-1 పరీక్ష పకడ్బందీగా నిర్వహించాలి

కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ఆసిఫాబాద్ టౌన్, మే 23 : జూన్ 9న నిర్వహించే గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షను పకడ్బందీగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్-1 పరీక్షా కేంద్రాన్ని అదనపు కలెక్టర్ దీపక్ తివారీ, అదనపు ఎస్పీ ప్రభాకర్ రావుతో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. పరీక్ష నిర్వహణ కోసం జిల్లాలో 13 కేంద్రాలను ఏర్పాటు చేయగా, 2,783 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని చెప్పారు. ఈ పరీక్షా కేంద్రంలో 210 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నారని, అన్ని వసతులు కల్పించాలని సూచించారు. ఇక్కడ సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని చెప్పారు. అభ్యర్థులు గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని, ఉదయం 9 గంటలకు పరీక్షా కేంద్రంలోకి అనుమతి ఉంటుందని, 9.30 గంటలకు బయోమెట్రిక్ చెకింగ్‌తో పాటు 10 గంటల వరకు ప్రవేశానికి అనుమతి ఉంటుందని, 10 దాటిన తర్వాత అనుమతించరని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసిఫాబాద్ రీజినల్ కో ఆర్డినేటర్ నర్సింహం, కళాశాల ప్రిన్సిపాల్, సీఐ పాల్గొన్నారు.

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వద్దు

ఆసిఫాబాద్ టౌన్, మే 23 : ధాన్యం కొనుగోళ్లలో జాప్యం వద్దని, ఈ నెల 30 లోగా కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం మండలంలోని అప్పపెల్లిలో అదనపు కలెక్టర్ దాసరి వేణుతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఆయన రైతులతో మాట్లాడారు. కొనుగోళ్లలో ఏవైనా సమస్యలుంటే పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ నెల 30లోగా కొనుగోళ్లు పూర్తి చేయాలని, తూకంలో మోసాలు లేకుండా చూడాలన్నారు. రైతుల వారీగా కొనుగోళ్లు, సాగు విస్తీర్ణం, ధాన్యం వివరాలను నిర్వాహకులు ప్రతిరోజూ ట్యాబ్‌లో ఎంట్రీ చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యం వెంటవెంటనే మిల్లులకు తరలించాలని సూచించారు. వర్షాలు కురిసే అవకాశమున్నందున టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి నర్సింహరావు, మేనేజర్ వినోద్ కుమార్, జిల్లా కో ఆపరేటివ్ అధికారి రబ్బానీ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ధాన్యం తరలింపు ప్రక్రియను వేగవంతం చేయాలి

మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

సమావేశంలో మాట్లాడుతున్న మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నస్పూర్, మే 23 : కొనుగోలు కేంద్రాల నుంచి రైసు మిల్లులకు ధాన్యం తరలించే ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ మోతీలాల్, ఇన్‌చార్జి జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి హరికృష్ణతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రైతుల వద్ద నుంచి ధాన్యం సేకరించేందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో 136, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 89, మెప్మా ఆధ్వర్యంలో 10, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో 51 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు. లారీలు, డ్రైవర్ల సర్దుబాటుపై సంబంధిత కాంట్రాక్టర్లు శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. వాహనాల కొరత లేకుండా చూడాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతుల వివరాలను ట్యాబ్‌లలో నమోదు చేయాలని తెలిపారు. ట్యాబ్ ఎంట్రీల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

విద్యార్థులను అభినందించిన కలెక్టర్

నస్పూర్, మే 23 : గోవాలో ఈ నెల 19న జరిగిన ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను గురువారం కలెక్టరేట్‌లో కలెక్టర్ బదావత్ సంతోష్ అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ గోవాలోని యూనివర్శల్ 369 షోటోకన్ కరాటే ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ పోటీల్లో జిల్లా కేంద్రంలోని జెన్ శిటో రియు కరాటే స్కూల్ విద్యార్థులు నిహారిక, శ్రీనిధి, జోష్మిత, ఆనందన, శ్రీగౌతమ్, సాయిరోహన్, మనీష్ ఉత్తమ ప్రతిభ కనబరిచి బహుమతులు గెలుచుకోవడం ఆనందంగా ఉందన్నారు.